సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



జెన్‌కో జలాశయాలు కళకళ
ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాల్లో భారీగా వరద నీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. IIలో




కొనసాగుతున్న వర్షాలు
జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హుకుంపేట, పాడేరు ప్రాంతాల్లో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. IIలో



పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం
పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతల్లో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పాడేరు సీడీపీవో ఝాన్సీరాణి సూచించారు. IIలో

పొత్తులో సీటు ఫట్!

- తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని జనసేన,టీడీపీ నేతల్లో ఆందోళన
- రాజకీయ భవిష్యత్‌పై ఆశావహుల అంతర్మథనం
- పెందుర్తిలో జనసేన నేత పంచకర్ల ఆశలకు పంక్చర్
- భీమిలి, ఉత్తర, పశ్చిమ, యలమంచిలి.. అన్నింట్లోనూ అదే పరిస్థితి
- నియోజకవర్గ స్థాయిలో పొత్తు పొడుపు కష్టమే...!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది అటు జనసేన, ఇటు టీడీపీ నేతల పరిస్థితి. టీడీపీతో జత కడతామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో తమ సీట్లకు ఎక్కడ ఎసరు పడుతుందోనన్న ఆందోళన ఇరు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతోంది. తొలి నుంచి పార్టీలో ఉండటంతో పాటు గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన అభ్యర్థులు.. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తుతో తమ సీటు గల్లంతవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పొత్తులో ఏయే సీట్లను కేటాయిస్తారో... అందులో తమ సీటు ఎక్కడ ఉంటుందోనని టీడీపీ నేతల్లోనూ గుబులు మొదలైంది. ప్రధానంగా పెందుర్తి, భీమిలి, విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, యలమంచిలి, చోడవరం, గాజువాక, పాయకరావుపేట వంటి నియోజకవర్గాల్లో అగమ్యగోచర పరిస్థితి నెలకొని ఉంది. తమకు సీటు కేటాయించని పక్షంలో తమ భవిష్యత్ ఏమిటో తేల్చుకుంటామనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతేకాకుండా సీటు ఆశించి తాజాగా జనసేనలో చేరిన అభ్యర్థుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఉన్న చోట ఉండకుండా... ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో తెలియని ఇటువంటి పార్టీలో ఎందుకు చేరామోనంటూ తలలపట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా పొత్తు ప్రకటన తర్వాత కేడర్‌లో ఉత్సాహం రావాల్సిన పరిస్థితి నుంచి దిక్కుతోచని దుస్థితికి తీసుకొచ్చారనే అభిప్రాయం ఇరు పార్టీ నేతల్లోనూ వ్యక్తమవుతోంది.

నియోజకవర్గాల వారీగా....!

ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ-జనసేన పొత్తులో సీట్లలో తకరారు ఏర్పడే పరిస్థితి నెలకొని ఉంది. పెందుర్తితో మొదలుకొని విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ, భీమిలి, గాజువాక, యలమంచిలి, చోడవరం, పాడేరు ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీల నుంచి సీట్లు ఆశిస్తున్న అభ్యర్థుల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితులున్నాయి. పైగా పొత్తు కోసం జనసేన నుంచి ప్రకటన రావడంతో తమకు ఇచ్చే సీట్ల సంఖ్య కూడా తక్కువే ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అయితే, టీడీపీ అవసరం కోసం అర్రులు చాస్తున్నందున.... తమ పార్టీకి సీట్లు తక్కువగా వస్తే తమ పరిస్థితి ఏమిటని టీడీపీ నేతలు సందిగ్ధంలో పడ్డారు. మొత్తంగా ఇరు పార్టీలకు చెందిన పరిస్థితిని నియోజకవర్గాల వారీగా గమనిస్తే..

- పెందుర్తి నియోజకవర్గం నుంచి ఇప్పటికే టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ ఉన్నారు. అక్కడ సీటు ఆశించి జనసేనలో చేరిన పంచకర్ల రమేష్‌బాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెందుర్తి నుంచి పోటీ చేస్తానని కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన పంచకర్ల... ఇప్పుడు పైనుంచి వచ్చిన ఆదేశాలతో పొత్తును స్వాగతిస్తున్నట్టు ప్రకటించారు. అయినప్పటికీ పొత్తు కాస్తా తనకు ఎసరు పెట్టిందని అనుచరుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది.
- గాజువాక నుంచి తిరిగి కోన తాతారావు, తిప్పల రమణారెడ్డిలు జనసేన పార్టీ నుంచి సీటును ఆశిస్తున్నారు. ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని టీడీపీకి చెందిన పల్లా శ్రీనివాసరావు మండిపడుతున్నారు. నియోజకవర్గాన్ని వదులుకుంటే ఇక రాజకీయాల్లో పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని అనుచరుల వద్ద ప్రస్తావిస్తూ... గాజువాక సీటును వదులుకునేది లేదని చెబుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే జనసేన నేతలు టీడీపీకి సహకరించే పరిస్థితి ఉండదని తెలుస్తోంది.
- విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గతంలో జనసేన నుంచి పోటీ చేసిన పసుపులేటి ఉషాకిరణ్... తనకు సీటు ఇవ్వకపోతే తన దారి తాను చూసుకునే పరిస్థితి ఉందని సమాచారం. ఇక్కడ టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు.
- విశాఖ దక్షిణం నుంచి మూగి శ్రీనివాస్, బీశెట్టి వసంతలక్ష్మితో పాటు తాజాగా ఆ పార్టీలో చేరిన కార్పొరేటర్ కందుల నాగరాజు కూడా సీటును ఆశిస్తున్నారు. ఇప్పుడు పొత్తులో ఈ సీటు కాస్తా టీడీపీకి వెళితే తమ పరిస్థితి ఏమిటంటూ వాపోతున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీ వ్యవహరిస్తున్నారు.
- గతంలో జనసేన నుంచి భీమిలిలో పోటీచేసిన పంచకర్ల సందీప్ సీటు తనకేనని ప్రకటించుకుంటున్నారు. ఇక్కడ ఏ పార్టీకి సీటు వచ్చినా.. ఇరు పార్టీల అభ్యర్థులు సహకరించుకునే పరిస్థితి లేదు.
- విశాఖ పశ్చిమలో జనసేన నుంచి పీలా రామకృష్ణ సీటు ఆశించి పార్టీలో పనిచేస్తున్నారు. ఇది టీడీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సీటు కావడంతో జనసేనకు హ్యాండ్ ఇస్తారని తెలుస్తోంది.
- విశాఖ తూర్పులో జనసేన నుంచి బొలిశెట్టి సత్య సీటు ఆశిస్తున్నారు. టీవీ చర్చల్లో ఎంత వాదించినా... పొత్తులో తన సీటు గోవిందా అని భోరుమంటున్నారు.
- ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన పీవీఎస్ఎన్ రాజు (చోడవరం), అనకాపల్లి నుంచి పోటీ చేసిన పరుచూరి భాస్కరరావులు పొత్తులో తమ సీటు ఏమవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.
- యలమంచిలిలో జనసేన నుంచి సుందరపు విజయ్‌కుమార్‌కు సీటు కేటాయిస్తే... టీడీపీ నుంచి సీటు ఆశిస్తున్న ప్రగాఢ నాగేశ్వరరావు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.
- పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన తరపున పనిచేస్తున్న శివదత్‌కు మొండిచేయి చూపించేలా ఉంది. అరకు నియోజకవర్గం నుంచి సాయిబాబా, పాడేరు నుంచి గంగులయ్య, పద్మలు కూడా జనసేన కోటాలో తమకు సీటు రాకపోతే తమ దారి తమదే అనే రీతిలో ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇరు పార్టీ నేతల మధ్య సీట్ల కోసం పోటీ నెలకొంది. పైన ప్రకటించినంత సులభంగా నియోజకవర్గాల్లో పొత్తు నెలకొనే పరిస్థితి లేదని ఇరు పార్టీల నేతలే ప్రకటిస్తుండటం గమనార్హం.

న్యూస్‌రీల్

నేడు విశాఖలో సీఎం జగన్ ట్రాన్సిట్ హాల్ట్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖ వస్తున్నారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా గన్నవరంలో బయలుదేరి ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా ద్వారపూడి వెళతారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొని.. తిరిగి మధ్యాహ్నం 2.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అడ్డతీగల, గంగవరం, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎండీ యూసఫ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



జగదీశ్వరి తదితర నేతలకు కండువాలు వేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: నల్లగొండ మాజీ సర్పంచ్, టీడీపీ నేత బచ్చెల జగదీశ్వరి, అదే పార్టీకి చెందిన జంపా రమణబాబు,లక్ష్మణరావు,రాజులమ్మ దంపతులు,కొప్పు చిన్నబాయ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి గురువారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పాలన ఎంతగానో ఆకట్టుకున్నందున వైఎస్సార్‌సీపీలో చేరామని జగదీశ్వరి తదితరులు తెలిపారు. జెడ్పీటీసీ నూకరాజు, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్. సూరిబాబు, అచ్యుత్, సుధాకర్ పాల్గొన్నారు.

జన్యులోపంతో శిశువు జననం

గూడెంకొత్తవీధి: మండలంలోని అగ్రహారంలో గురువారం వింత శిశువు జన్మించింది. జన్యులోపమే కారణమని వైద్యులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన విజయలక్ష్మికి గురువారం పురిటి నొప్పులు రావడంతో 108లో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఇక్కడ ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు తెల్లని పొరతో వింత రూపంలో ఉన్నందున ఇందుకు జన్యులోపమే కారణమని వైద్యాధికారులు వినయ్ కుమార్, అచ్యుత్ తెలిపారు. ఇలావుండగా విజయలక్ష్మి తొలి కాన్పు, రెండో కాన్పులో కూడా ఆడ శిశువులు పుట్టారు. అయితే వీరిలో మొదటి కాన్పులో పుట్టిన శిశువు అప్పట్లో వింతగా ఉండేదని, రెండు రోజుల వ్యవధిలోనే మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రెండో కాన్పు శిశువు కూడా మూడు నెలల వ్యవధిలో మృతి చెందినట్టు వారు వివరించారు. ప్రస్తుత శిశువు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా లేనందున చికిత్స నిమిత్తం చింతపల్లి సీహెచ్‌సీకి తరలించినట్టు వైద్యులు తెలిపారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే



కొట్టుకుపోయిన కాజ్‌వే, అవతలివైపు ఉండిపోయిన సంగంవలస గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సంగంవలస గ్రామానికి వెళ్లే మార్గంలో కాజ్‌వే వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. పాఠశాలకు గండి దాటి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసరాలు తెచ్చుకునే వీలు కూడా లేకుండా పోయిందని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ కోరారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో,అరకు ఎమ్మెల్యే స్పందించి సంగంవలస గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

నేడు ఏక్సెస్ 2కె23 సదస్సు ప్రారంభం

ఏయూక్యాంపస్ (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏక్సెస్ 2కె23 పేరిట రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఏటా ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో భాగంగా పేపర్ ప్రజెంటేషన్, మోడల్స్ తయారీ, క్విజ్, పోస్టర్ తయారీ ఉంటుందన్నారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

23 నుంచి డీఆర్‌ఎం కప్ స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ ఈ నెల 23, 24వ తేదీల్లో జరగనుంది. ఈకోర్టా వాల్తేర్ ఆధ్వర్యంలో రైల్వే స్విమ్మింగ్ పూల్‌లో 50 మీటర్ల ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్, బటర్ ఫ్లై అంశాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తారు. 6–7 ఏళ్ల వారికి ఓ గ్రూప్‌లో, 18+ ఏళ్ల వారికి మరో గ్రూప్‌లో పోటీలు నిర్వహిస్తుండగా.. 8 నుంచి 18 ఏళ్లలోపు వారికి మరో నాలుగు గ్రూప్‌ల్లో పోటీలు జరగనున్నాయి. కాగా.. ఈ చాంపియన్‌షిప్ పోస్టర్‌ను గురువారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ విడుదల చేశారు. ఏడీఆర్‌ఎం మనోజ్ కుమార్, క్రీడాధికారి ప్రవీణ్‌కుమార్, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ పాల్గొన్నారు.

16న కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట(విశాఖ): కేంద్ర టెలీ కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ చౌహాన్ ఈ నెల 16న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 8.15 గంటలకు విశాఖ చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 17న స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు ఢిల్లీ బయలుదేరుతారు.

40 వేల నకిలీ, మృతుల ఓట్ల తొలగింపు

- కొత్తవి నమోదుకు చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో ఇంటింటా నిర్వహించిన ఓటర్ల సవరణ సర్వేలో 40 వేల ఓట్లు తొలగించినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం పలు పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలగించిన ఓట్లలో మృతులు, నకిలీ ఉన్నట్టు గుర్తించామన్నారు. వీటికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మృతులు, నకిలీ ఓటర్లు, డబుల్ ఎంట్రీల తొలగింపు లక్ష్యంగా ఓటర్ల సవరణ సర్వే నిర్వహించామన్నారు. జిల్లాలో 2.30 లక్షల మంది పీవీటీజీ ఓటర్లు ఉండగా 1.30 లక్షల మంది మాత్రమే నమోదైనట్టు కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన లక్ష మందిలో 80 వేల మందిని ఓటరు జాబితాలో చేర్పించినట్టు ఆయన వివరించారు. వంద సంవత్సరాల వయసు పైబడినవారు 66 మంది ఉన్నారని, వారిని గుర్తించి మృతులను తొలగించినట్టు తెలిపారు. అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 10వేల ఫిర్యాదులు అందగా వాటిలో ఏడువేల ఓటర్ల వివరాలను పరిశీలించి తొలగించామని చెప్పారు. మిగతా వాటిలో 2,300 ఫిర్యాదులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అన్ని రాజకీయపార్టీలు వారి తరఫున బూత్‌లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు.జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సిదరి రాంబాబు, బీజేపీ నేత కె.రాఘవేంద్రరావు, సీపీఐ నేత వి.జ్యోతి అమర్‌నాథ్, సీపీఐ(ఎం) నేత బొజ్జన్న, బీఎస్పీ నేత ఎం.పండన్న పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం నెరవేర్చండి



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎం, హెచ్‌వో, గ్రామ వలంటీర్, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని నీరు కలుషితం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని వైద్యసిబ్బందికి సూచించారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జ్వరాలు, వ్యాధులు ప్రబలితే వెంటనే గ్రామ ఆశ కార్యకర్త, గ్రామ వలంటీర్ సమాచారం అందించాలని సూచించారు. వెంటనే గ్రామాలకు వెళ్లి తక్షణ వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి వైద్యం అందించడం జరుగుతుందని ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ నర్సమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, ఎంపీటీసీ భాగ్యవతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ వంతాల కొండలరావు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఇంటి స్థలం

- స్పందన వినతికి సత్వర న్యాయం



ఇంటి స్థల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: స్పందన వినతికి సత్వర న్యాయం లభించింది. పాడేరులో సుండ్రుపుట్టుకి చెందిన వంటారి చంటిబాబు అనే దివ్యాంగుడు ఇంటిస్థలం కోసం ఐటీడీఏ స్పందనలో కలెక్టర్ సమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు దరఖాస్తు అందజేశాడు. రెండు కాళ్లు పని చేయని అతని దీన పరిస్థితిపై వారు చలించిపోయారు. వారి ఆదేశాల మేరకు అతనికి తలారిసింగి గ్రామంలో ఒకటిన్నర సెంట్లు పాడేరు తహసీల్దార్ వంజంగి త్రినాథరావు కేటాయించారు. ఈ మేరకు స్థల ధ్రువీకరణ పత్రాన్ని గురువారం ఐటీడీఏ పీవో అభిషేక్ అందజేశారు. ఐటీడీఏ నుంచి రూ.20 వేలు మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

స్నేహితులతో తిరుగుతుండగా పట్టుకున్న పోలీసులు, ఉపాధ్యాయులు



విద్యార్థిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు

అరకులోయ రూరల్: వారం రోజులుగా కనిపించకుండా పోయిన స్థానిక గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పోలీసులు, ఉపాధ్యాయులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక గురుకుల ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ దూదుగూడకు చెందిన వంతాల చిన్నారావు వారం రోజుల నుంచి కనిపించకుండా పోవడం తెలిసిందే. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు సిబ్బందిని నిలదీశారు. ఈ నేపథ్యంలో గసభ ప్రాంతంలో విద్యార్థి ఉన్నట్టు సమాచారం సేకరించిన పోలీసులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నారు. తప్పించుకుని స్నేహితులతో తిరుగుతున్న విద్యార్థి చిన్నారావును గురువారం పట్టుకుని తీసుకువచ్చారు. ఎస్‌ఐ సంతోష్ సమక్షంలో తల్లిదండ్రులకు విద్యార్థిని అప్పగించారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ప్రసాదరావు, అప్పలరాజు, మోహన్, పోతురాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నరసింహ, అంజలీరావును సత్కరిస్తున్న కార్మికులు

అనంతగిరి: టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. గురువారం హరిత రిసార్ట్స్‌లో సంఘ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఉపాధ్యక్షుడు అంజలీరావు, సభ్యులను టూరిజం కార్మికులు సన్మానించారు.టూరిజం కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.గంగరాజు, బాబూరావు, సన్యాసమ్మ, విజయ్‌కుమార్, బుద్ధరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఆశ్రమ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అడ్డతీగల: కాకినాడలో ఈనెల 13వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడాపోటీలు రెజ్లింగ్ విభాగంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరిచారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కుంజం వెంకన్నదొర 48 కిలోల విభాగం, తొమ్మిదో తరగతి చదువుతున్న పిట్టా నిఖిల్‌రెడ్డి 55 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం వరప్రసాద్ తెలిపారు. వారిని పీఈటీ బండారు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చెస్ పోటీలకు వేములోవ విద్యార్థిని



రాష్ట్ర చదరంగ పోటీలకు ఎంపికైన రాధామణిని అభినందిస్తున్న వేములోవ ఆశ్రమపాఠశాల సిబ్బంది

గంగవరం : మండలంలోని వేములోవ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని జి.ధారమణి రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఎంపికై నట్టు హెచ్‌ఎం గీతాంజలి తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం జట్టు ఎంపికల్లో మండలంలోని వేములోవ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థినులు రాధామణి, కుంజం లక్ష్మీప్రియ పాల్గొన్నారు. వీరిలో రాధామణి విశేష ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్‌ఎంపీపీ రామతులసీ, ఎంపీటీసీ కనకలక్ష్మి, పిడమామిడి సర్పంచ్ నేషం మరిడమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యజ్జు వెంకటేశ్వరరావు, తదితరులు రాధామణిని, పీడీ బాలరాజును అభినందించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

శిబిరం చిరునామా
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం
వంజంగి హిల్స్ రోడ్డు, పాడేరు
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
94915 53782, 70757 09205

జెన్‌కో జలాశయాలు కళకళ

సీలేరు : ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు కళకళలాడుతున్నాయి. ప్రమాదస్థాయికి చేరుకుంటుండటంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు నీటిమట్టాలను పరిశీలించి తగు చర్యలు చేపడతున్నారు. జోలాపుట్టు, బలిమెల, సీలేరు, డొంకరాయి జలాశయాల్లోకి మూడు రోజులుగా భారీగా వరదనీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో గురువారం సీలేరు జలాశయ నీటి మట్టాన్ని జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, ఏడీ అప్పలనాయుడు పరిశీలించారు.

ప్రమాదస్థాయికి డొంకరాయి

డొంకరాయి జలాశయం గురువారం సాయంత్రానికి ప్రమాదస్థాయికి చేరుకుంది. పూర్తిస్థాయి సామర్థ్యం 1037 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1035.30 అడుగులకు చేరింది. మరో అడుగు పెరిగితే గేట్లు ఎత్తివేసే యోచనలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం ఈ జలాశయంలో ఆరువేల క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. సీలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 1360 అడుగులు కాగా, ప్రస్తుతం 1352.30 అడుగుల మేర ఉంది. ఈ ప్రాజెక్టులోకి పిల్లిగెడ్డ వాగునుంచి రోజుకు ఐదు వేల క్యూసెక్కుల వరదనీరు చేరుతోందని అధికార వర్గాలు తెలిపాయి.

అర్హులందరికీ పింఛన్లు



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పక్కన నేతలు



ఐనాడలో కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్మును అందజేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



గంగవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

కొయ్యూరు: జగనన్న ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొండగోకిరి సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాడేరు మండలానికి-368, కొయ్యూరుకు-433, జి.మాడుగుల-348, గూడెంకొత్తవీధి-416, చింతపల్లి మండలానికి-579 కొత్త పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. టీడీపీ హయాంలో పింఛన్లు కోసం పండుటాకులు, లబ్ధిదారులు నానా అవస్థలు పడేవారని, జన్మభూమి కమిటీలు అక్రమ దౌర్జన్యం సాగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జగనన్న పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు, పథకాలు మంజూరవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము పెంచుతున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలి నాయుడు, సర్పంచ్ నూకరత్నం, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, శేఖర్, శ్రీను, సూరిబాబు, గంగాధర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు అన్నారు. మండలంలోని మారుమూల ఐనాడ గ్రామ పంచాయతీలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఐనాడ గ్రామ పంచాయతీలో కొత్తగా మంజూరైన 13 మందికి పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ జగనన్న పాలనలో గడప వద్దకే పింఛన్ సొమ్ము అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందించడంతో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లను ఆయన అభినందించారు. నాయకులు సింహాచలం, ఈశ్వరరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ అనంబాబు అన్నారు.మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో పంచాయతీలో ప్రభుత్వం కొత్తగా 175 మందికి మంజూరు చేసిన పింఛన్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 4070 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు.ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ కె.అక్కమ్మ, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, వెంకటలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, పార్టీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు బాబి, ఏడుకొండలు, రాష్ట్ర రైతు కార్యదర్శి ప్రసాద్, నాయకుడు కొండారావు, పార్టీ కన్వీనర్ అప్పలరాజు, సచివాలయ కన్వీనర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఎండపల్లి- గంగవరం బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ శంఖుస్థాపన చేశారు.

ప్రజలతో మమేకం అయ్యేందుకే ఆత్మీయ సమ్మేళనం

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అదహాల్లి

రాజవొమ్మంగి: లోతట్టు గ్రామాల్లోని ప్రజలతో మమేకం అయ్యేందుకు, వారి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ హడహాల్లి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలో లోతట్టు అటవీప్రాంతంలో నివసిస్తున్న రాజుపేట గ్రామస్తులను కలిశారు. అక్కడే ఆత్మీయ సమ్మేళన సమావేశం ఏర్పాటు చేసి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసుల పట్ల సదాభిప్రాయం కలిగేలా ఆత్మీయ సమ్మేళనం, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజనుల సమస్యలు తెలుసుకుని వాటిని సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఏఎస్పీ తెలిపారు. రాజుపేటకు రహదారి లేక దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన వెళుతున్నామని ఆదివాసీలు ఆయనకు వివరించారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిల స్థితికి చేరుకుందని వారు వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



ఆదివాసీ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ జగదీష్ అదహాల్లి సీఐ, ఎస్‌హెచ్‌వోలు

గంజాయి సాగుపై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. గంజాయి జోలికి వెళ్లి జైలుపాలు కావొద్దని గిరి యువతకు సూచించారు. ప్రభుత్వ నోటిఫికేషన్ వస్తేనే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలని సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని సుమారు 45 కుటుంబాలకు చీరలు, దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. యువతకు వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు.ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు చుంద్రు లోవలక్ష్మి, సీఐ బాజిలాల్, ఎస్‌హెచ్‌వో(సీఐ) గోపీ నరేంద్రప్రసాద్, ఎస్ఐ రఘునాథరావు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి మంచి భవిష్యత్

సాక్షి, పాడేరు: జిల్లాలో పర్యటనకు వచ్చిన కుమ్మరి/శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను గురువారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలివాహన కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కుమ్మరి, శాలివాహన ప్రజల శ్రేయస్సుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగానికి మంచి భవిష్యత్ ఉందని,, పర్యాటక ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటుచేసి, పర్యావరణ హితమైన మట్టి పాత్రల మార్కెటింగ్‌కు ప్రొత్సహిస్తామన్నారు.

కుమ్మరి, శాలివాహన సంక్షేమ కమిటీ

జిల్లాలో నలుగురు సభ్యులతో కుమ్మరి, శాలివాహన సంక్షేమ కమిటీ ఏర్పాటైనట్లు ఆ కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం వెల్లడించారు. జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే అధికారిక కమిటీలో జిల్లా ఎస్పీ, జిల్లా సహకార అధికారి, డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగా ఉంటారని, అదే విధంగా జిల్లాకు చెందిన కుమ్మరి/శాలివాహన సీఎస్ఎఫ్ లిమిటెడ్ డైరెక్టర్ ఒక సభ్యునిగా ఉంటారని, బీసీ సంక్షేమశాఖాధికారి మెంబర్- కన్వీనర్‌గా



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్, ఇతర ప్రతినిధులు

ఉంటారని, వీరితోపాటు కలెక్టర్ ఎంపిక చేసిన కుమ్మరి/శాలివాహన వృత్తికి చెందిన నలుగురు వ్యక్తులు కూడా సభ్యులుగా ఉంటారని చైర్మన్ వివరించారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గం నుంచి శ్రీకాకుళపు వరలక్ష్మి, శ్రీకాకుళపు అప్పారావు, రంపచోడవరం నియోజకవర్గం నుంచి రెల్లి వెంకటేష్‌లను సభ్యులుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కలెక్టర్ చేతులమీదుగా అందజేశారు. కుమ్మరి/శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

అంతర పంటల పేరుతో గంజాయి సాగు

ఆరుగురి అరెస్ట్

రాజవొమ్మంగి : దాడులు నిర్వహించి పసుపు దొడ్లలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రహస్యంగా 50 నుంచి వంద గంజాయి మొక్కలు నాటిన మత్స్యాపురం పంచాయతీ పెదబురుగుల గ్రామానికి చెందిన సీదర అర్జున్, పాంగి కొండమ్మ, గన్నేరుపుట్టు గ్రామానికి చెందిన గడ్డి స్వామి, తీగలవలస పంచాయతీ ఓలుగడ్డ గ్రామానికి చెందిన వంతల వీణేశ్వరావు, కిల్లో రామన్నపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. వీరు సాగు చేస్తున్న గంజాయి మొక్కలను కాల్చి బూడిద చేసామన్నారు. అంతర్‌పంటల పేరుతో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని సాగుదారులను హెచ్చరించారు. గిరిజన రైతులు, యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఐటీడీఏ ద్వారా పలు రకాల పంటల సాగులో అధికారులు ప్రోత్సహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి సాగు చేస్తున్న వారిపై గట్టి నిఘా వుందని, పట్టుబడితే జైలు తప్పదని హెచ్చరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- సీడీపీవో ఝాన్సీరాణి

సాక్షి,పాడేరు: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికల్లో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పాడేరు ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయి పౌష్టికాహార మాసోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పలు అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలంతా పౌష్టికాహారంతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని అంగన్వాడీ కేంద్రాలలోను వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో నాణ్యమైన, మేలైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందుతున్న సంపూర్ణ పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యలు తగ్గుతున్నాయన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉర్మిళ, రమణి, రాజేశ్వరి, కవిత, లక్ష్మి, చెల్లయమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు



పాడేరు మండలం బొక్కెళ్లు కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



గుంట సీమలో నీట మునిగిన పంట పొలాలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హుకుంపేట, పాడేరు ప్రాంతాల్లో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ప్రధాన గెడ్డలు, వాగులలో వరద ఉధృతి నెలకొంది. జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాడేరు మండలంలోని బొక్కెళ్లు, పెదబయలు మండలం పరదానిపుట్టు కాజ్‌వేల మీదుగా మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.గుత్తులపుట్టు సంతకు వచ్చే మార్గం లేక పాడేరు, పెదబయలు మండలాలకు చెందిన సుమారు వంద గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో 259.3 ఎంఎం వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా గురువారం 259.3 ఎంఎం వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 35.8, పెదబయలులో 35.8, హుకుంపేటలో 31.8, జీకే వీధిలో 20.2, పాడేరులో 18.6, అరకులోయలో 17.9, చింతపల్లిలో 14.1, చింతూరులో 13.7, జి.మాడుగులలో 12.7, డుంబ్రిగుడలో 12.4, అనంతగిరిలో 9, రాజవొమ్మంగిలో 8, మారేడుమిల్లిలో 6.9, వై.రామవరంలో 6.8, అడ్డతీగలలో 3.4, గంగవరంలో 2.7, కూనవరంలో 2.2, వి.ఆర్.పురంలో 2.1, కొయ్యూరులో 2.1, ఎటపాకలో 1.7, రంపచోడవరంలో ఒకటి, దేవీపట్నంలో 0.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.

డుంబ్రిగుడ: మండలంలో కురుస్తున్న వర్షాలకు డొమంగి గ్రామ సమీపంలోని గుంటసీమ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంటసీమ ప్రాంతంలోని పొలాలు నీటమునిగాయి. ముంపునకు గురైన ప్రాంతాల్లో తక్షణం నీరు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ రైతులకు సూచిస్తోంది.

పాడి రైతుల ఆర్థిక బలోపేతానికి చర్యలు

- పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్‌నరసింహులు



పశు వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీడీ నరసింహులు

పెదబయలు: జిల్లాలో పాడి రైతుల ఆర్థిక బలోపేతానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నరసింహులు సూచించారు. గురువారం స్థానిక పశువైద్య కేంద్రంలో పెదబయలు, ముంచంగిపుట్టు పశు సంవర్థక శాఖ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. కోళ్ల ఫారం, గొర్రెల మేకల పెంపకంపై ఆసక్తి గల రైతులను గుర్తించి యూనిట్లు ఏర్పాటుపై అవగాహన కల్పించాలని సూచించారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో రైతులకు జీవాల పెంపకం, యాజమాన్య పద్ధతులపై పూర్తిస్థాయిలో సూచనలు అందించాలని ఆదేశించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజ రవికుమార్, పెదబయలు ముంచంగిపుట్టు మండలాల పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి, కిలగాడ రెండు మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

మాకవరపాలెం: భార్య మృతికి కారణమైన భర్తను అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు గురువారం తెలిపారు. మండలంలోని చామంతిపురం గ్రామానికి చెందిన షేక్ రాజాసాహెబ్(23)తో ఇదే గ్రామానికి చెందిన సైదాబి(21)కి మూడేళ్ల క్రితం వివాహమైందని, వీరికి బాబు ఉన్నాడన్నారు. ఇటీవల రాజాసాహెబ్ తన భార్యపై అనుమానంతో వేధిస్తుండేవాడని, వాటిని భరించలేని ఆమె స్థానిక బావిలో దూకి మంగళవారం ఆత్మహత్య చేసుకుందన్నారు. దీనిపై మృతురాలి తండ్రి బాబూరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టి అరెస్టు చేశామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మి

రంపచోవరం: రంపచోడవరం ఆసుపత్రిలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మి అన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను గురువారం ఆమె పరిశీలించారు.రోగులకు, సహాయకులకు అందించే భోజనం తయారీని పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడారు. నిర్దిష్ట ప్రమాణంలో రోగులకు భోజనం అందించాలన్నారు. వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై వారితో మాట్లాడారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు.ల్యాబ్‌లో టెస్టులు జరుగుతున్న తీరు పరిశీలించారు.మందుల స్టోర్‌ను పరిశీలించి, స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులను వేరే ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా ఇక్కడే ప్రసవాలు, సిజేరియన్‌లు చేసినట్లు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో రోజు రోజుకి వైద్య సేవలను మరింతగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉండడంతో సాధ్యమైనంత వరకు అన్ని రకాల సేవలు ఇక్కడే అందిస్తున్నమన్నారు. వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచడంతో కొత్త భవనం నిర్మాణం జరుతుందని, భవనం పూర్తయితే రోగులకు మరింత వసతి అందుబాటులోకి వస్తాయన్నారు. డాక్టర్ సుధాకర్ ఆర్థో సర్జన్ ఆస్పత్రిలో ప్రజలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రి ఇంటిరియల్, ఆవరణ పరిశీలించారు. గార్డెన్‌ను బాగా పెంచాలన్నారు.



ఏరియా ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ లక్ష్మి

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

పాడేరు ఏఎస్పీ ధీరజ్

పాడేరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి చవితి మండపాలు, పందిర్లు ఏర్పాటుకు పోలీసుస్టేషన్ అనుమతి తప్పనిసరి అని పాడేరు ఏఎస్పీ కె. ధీరజ్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చవితి ఉత్సవాల నిర్వాహకులు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి అనుమతి పొందాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి కమిటీ ఏర్పాటు చేసుకొని వారి వివరాలను సంబంధిత పోలీసుస్టేషన్‌కు అందజేయాలన్నారు. రహదారుల పక్కన వినాయక మండపాలు, పందిర్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకూడదని సూచించారు. ప్రతిష్ఠించనున్న వినాయకుని విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవాలు నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, నిమజ్జన ప్రదేశం, నిమజ్జన కార్యక్రమానికి ఉపయోగించే వాహనం వివరాలను తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు అందజేయాలన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి ఉందన్నారు. ఉత్సవాలు, ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు సైబర్ క్రైం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమతులు లేని ఆన్‌లైన్ లోన్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దన్నారు. అనుమానం వస్తే సమీప పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్, చిత్రంలో సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్

అండర్ - 19 ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక

చోడవరం రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో పలు క్రీడా పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధ, గురువారాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. మొదటి రోజున కబడ్డీ పోటీలకు 180 మంది, టెన్నికాయిట్ పోటీలకు 50 మంది, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 52 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండో రోజు వాలీబాల్ పోటీలకు అత్యధికంగా 290 మంది, త్రోబాల్ పోటీలకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిని జట్లుగా విభజించి ఆయా పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ప్రాథమికంగా ఎంపిక చేశారు. రెండు రోజుల క్రీడాంశాలలో పాల్గొనడానికి వచ్చిన 632 మంది విద్యార్థినులు, విద్యార్థులతో క్రీడా మైదానంలో సందడి నెలకొంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గోతిరెడ్డి రాంబాబు నేతృత్వంలో జిల్లా జట్ల ఎంపిక పోటీలను సాఫీగా నిర్వహించడంలో పలు పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు తమ వంతు కృషి చేశారు.



అండర్ -19 బాలికల కబడ్డీ జిల్లా జట్టు

గొంపలో గ్యాస్ లీక్

- ఇంట్లోని గృహోపకరణాలన్నీ దగ్ధం
- తప్పిన ప్రాణాపాయం

రావికమతం: మండలంలోని గొంప గ్రామానికి చెందిన సీరందాసు ఆనంద్ ఇంట్లో గురువారం సాయంత్రం వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లోని గృహోపకరణాలన్నీ కాలిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో వంట చేస్తున్న ఇల్లాలితోపాటు ఆమె భర్త, ఇద్దరు పిల్లలు బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. సీరందాసు భార్య స్వాతి సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వంట చేస్తుండగా సిలిండర్ వద్ద గ్యాస్ లీకైంది. దీంతో అప్రమత్తమైన ఆమె రెగ్యులేటర్ కట్టివేసింది. అయినా గ్యాస్ లీకు ఆగలేదు. మరింత ఎక్కువ కావడంతో ఆమె భయంతో గట్టిగా కేకలేస్తూ అప్రమత్తం చేసింది. దాంతో తన భర్త ఆనంద్, ఇద్దరు చిన్నారులను తీసుకుని బయటకు పరుగులు తీసింది. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, ధాన్యం, బియ్యం, ఇతర గృహోపకరణాలన్నీ కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక శకటానికి ఫోన్ చేసినప్పటికీ వారు సకాలంలో రాకపోవడంతో స్థానికులు పల్లా పెదనాయుడు, పసుపులేటి శ్రీను, యువకులు మంటలను అదుపు చేశారు.



దగ్ధమవుతున్న ఇంట్లోని గృహోపకరణాలు

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన వ్యాపారవేత్త హనుమంతు లక్ష్మీనారాయణ రమణమ్మ దంపతులు రూ.1,16,100ల విరాళాన్ని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లకు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి దేవస్థాన ప్రాంగణ వాయువ్య మూలలో ఉపారం సమర్పించుకునేందుకు వీలుగా ఏర్పాట్ల కోసం ఈ విరాళాన్ని అందించినట్లుతెలిపారు. ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని భక్తుల సౌకర్యార్థం ఆలయం బయటనున్న వేపచెట్టు దగ్గర ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బుద్ధ నరసింగరావు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.